## క్లుప్తంగా

### 20న ఆలయ భూముల వేలం

కొలిమిగుండ్ల: స్థానిక కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూములకు ఈనెల 20న వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వీరయ్య సోమవారం తెలిపారు. వివిధ సర్వే నెంబర్లలోని 31.11 ఎకరాలకు వేలం నిర్వహిస్తున్నామన్నారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.1000 డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక ఏడాదికి మాత్రమే వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు పాల్గొనాలని సూచించారు.

### సబ్‌ట్రెజరీ అధికారిగా బాధ్యతలు



సునీల్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

డోన్: డోన్ సబ్‌ట్రెజరీ అధికారిగా సునీల్‌కుమార్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన రఘునందన్ ఎమ్మిగనూరుకు బదిలీ అయ్యారు. ఉద్యోగులు ఇద్దరిని ఘనంగా సత్కరించారు. ఒకరికి వీడ్కోలు పలికి మరొకరికి స్వాగతం పలికారు.

### అవుకు ఏఓగా కరిమున్నీసా



అవుకు: మండల వ్యవసాయాధికారిగా కరిమున్నీసా సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇది వరకు ఇక్కడ పనిచేస్తున్న అబ్దుల్ హక్ కదిరి నియోజకవర్గం నల్లమాడకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నందికొట్కూరు వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో టెక్నికల్ వ్యవసాయ అధికారిణిగా పనిచేస్తున్న కరిమున్నీసా అవుకుకు బదిలీపై వచ్చారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు అందుబాటులో ఉంటూ, వారికి సలహాలు, సూచనలు అందిస్తామన్నారు.

### ఈఓఆర్డీగా బాధ్యతలు



చంద్రమౌళీశ్వర గౌడ్

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీగా చంద్రమౌళీశ్వర గౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ పనిచేసిన శివప్రసాద్ దొర్నిపాడుకు వెళ్లారు. ఆయన స్థానంలో పాణ్యంలో విధులు నిర్వహించే ఈఓఆర్డీ చంద్రమౌళీశ్వర గౌడ్‌ను కొలిమిగుండ్లకు నియమించారు.

### సీసీరోడ్డు పనులు ప్రారంభం



ఆటోనగర్‌లో పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్: మున్సిపల్ పరిధిలోని ఆటోనగర్‌లో రూ.23 లక్షలతో చేపట్టిన సీసీరోడ్లు, డ్రైనేజీ పనులను సోమవారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ప్రారంభించారు. రెండు నెలల్లో ఈ పనులను పూర్తిచేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు సుంకన్న, ఆర్ట్ రమణ, మున్సిపల్ ఏఈ సురేష్, కాంట్రాక్టర్ సీమసుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 21లోపు మోడల్ స్కూల్‌లో చేరాలి

డోన్ టౌన్: ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్ ప్రవేశాల్లో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 21వ తేదీలోపు అడ్మిషన్ పొందాలని ప్రిన్సిపాల్ కేశరాజు శ్రీనివాస్ తెలిపారు. అడ్మిషన్ పొందకుంటే నిబంధనల ప్రకారం వారి సీటును రద్దు చేసి తర్వాత అర్హత సాధించిన తర్వాత విద్యార్థికి అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు.

### సారా స్వాధీనం

అవుకు: మండల పరిధిలోని రామాపురం గ్రామంలో సోమవారం 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ లింగయ్య తెలిపారు. గ్రామంలోని సాయిబాబా ఆలయం వద్ద సాలత్రి బాలనాగమ్మ అనే మహిళ నాటుసారా అమ్ముతుండగా అదుపులోకి తీసుకుని సారాను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అనంతరం ఆమెను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు వెల్లడించారు.

### పిల్లలను పనిలో పెట్టుకుంటే శిక్షార్హులు

డోన్ టౌన్: పరిశ్రమలు, హోటళ్లు, దుకాణాల్లో 14 ఏళ్ల నిండని పిల్లలను పనిలో పెట్టుకుంటే శిక్షార్హులవుతారని జిల్లా బాలల సంరక్షణ అధికారి శ్రీనివాస్ అన్నారు. బాల కార్మికుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని పలు దుకాణాలు, హోటళ్లు, మెకానిక్ షాపులు, వెల్డింగ్, కార్పెంటర్ షాపుల వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బాల కార్మిక చట్టాలపై దుకాణం యజమానులకు అవగాహన కల్పించారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా నేరమని తెలిపారు. పిల్లలను పనిలో పెట్టుకున్నట్లు గుర్తిస్తే 1098కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని.. వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. డోన్ లేబర్ ఆఫీసర్ శోభారాణి, కానిస్టేబుల్ నాగభూషణం పాల్గొన్నారు.

# చేనుకు చేవ.. రైతుకు రొక్కం



కొత్తబురుజులో పీఎండీఎస్ సాగును పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారులు

- ఎంపీడీఎస్‌పై రైతులకు పెరుగుతున్న ఆసక్తి
- మిశ్రమ పంటలతో పశుగ్రాసం కొరత నుంచి విముక్తి
- భూసారం పెంపుతో పాటు రైతులకు అదనపు ఆదాయం

డోన్: ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్(పీఎండీఎస్).. అంటే వర్ష రుతువు కన్నా ముందుగానే విత్తనాలు విత్తుకోవడం. ఈ పద్ధతి ద్వారా 365 రోజులూ పంటలతో భూమిని కప్పబడి ఉంచడం, రసాయన ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులు చల్లకుండా ఉండడం వల్ల భూమాత తిరిగి జీవాన్ని సంతరించుకుంటుంది. ఏడాది పొడవునా పొలం పచ్చగా ఉండేలా చేస్తుంది. చేనుకు చేవ-రైతుకు రొక్కం అనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు సాధికారిక సంస్థ సహకారంతో పీఎండీఎస్ సాగు ప్రక్రియలో విప్లవాత్మకమైన మార్పును తెచ్చింది. ప్రకృతి వ్యవసాయ ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యంతో ఈ విధానమైన మిశ్రమ పంట సాగును ప్రోత్సహిస్తున్నామని.. ఈ విధానాన్నే నవధాన్యాల సాగు పద్ధతి కూడా అంటారని పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ నాగరాజు, వ్యవసాయాధికారులు తెలిపారు. ఈ విధానంపై వారి మాటల్లోనే..

**నవధాన్యాలతో పశుగ్రాసం**

పంట పొలాలు బీడుగా ఉన్న సమయంలో నీటి సాంద్రత అధికంగా ఉన్న భూముల్లో పప్పుజాతికి చెందిన మినుములు, పెసర, బొబ్బర్ల, చిక్కుడు, నూనెజాతికి చెందిన నువ్వులు, ఆముదం, వేరుశనగ, సుగంధ ద్రవ్యాల జాతికి చెందిన ధనియాలు, మెంతులు, ఆవాలు, ధాన్యపు జాతికి చెందిన రాగులు, మొక్కజొన్న, కొర్రలు, సామలు, పచ్చిరొట్టె జాతికి చెందిన పిల్లిపెసర, గీలుగ, కట్టజనుము, ఆకుకూరలు, దుంపజాతి, తీగ జాతి పంటలను ఈ 40 రోజుల్లో పండించడం ద్వారా చేనుకు మరింత బలం చేకూరి



గోసానిపల్లెలో ఏపుగా పెరిగిన నవధాన్యాల పశుగ్రాసం

రైతుకు పశుగ్రాసం లభిస్తుంది. వీటిని విక్రయించుకుని అదనపు ఆదాయం పొందవచ్చు.

**పంట కాలానికి సంబంధం లేకుండా సాగు**

ఖరీఫ్, రబీ సీజన్‌లకు మధ్య భూములు మరింత సారవంతంగా తీర్చిదిద్దడంతో పాటు పశుగ్రాస కొరతను తీర్చేందుకు బీడుగా ఉన్న భూముల్లో పీఎండీఎస్ పద్ధతి ద్వారా అనేక రకాల పశుగ్రాసాన్ని రైతులు సులువుగా పండించుకోవచ్చు. మార్చి, మే, జూన్ మాసాల్లో కేవలం 40 రోజుల్లో ఏపుగా పెరిగే విధంగా నవధాన్యాలను పంట పొలాల్లో రైతులు చల్లుకోవచ్చు.

**రైతుకు లాభం.. పొలానికి బలం**

పీఎండీఎస్ పద్ధతి ద్వారా నవధాన్యాలను సాగుచేయగలిగితే 365 రోజులు భూమిలో సూక్ష్మజీవులు పెంపొంది పంటలు ఏపుగా పెరిగేందుకు దోహదపడతాయి. సూక్ష్మపోషకాలు మొక్కల వేరు వ్యవస్థను సులువుగా గ్రహిస్తాయి. నవధాన్యాల పంటలు పశువులకు పోషక విలువలతో కూడిన పచ్చిమేతగా ఎంతగానో ఉపయోగపడుతాయి. నేల గుల్లబారి వానపాములు వృద్ధిచెందుతాయి. నేలలో నీటి సామర్థ్యం పెరుగుతుంది. నేల కోతకు గురికాదు. జీవ వైవిధ్యం, సేంద్రియ కర్బన శాతం నేలలో వృద్ధి చెందుతుంది. ప్రధాన పంటల్లో కలుపు తగ్గడమే కాక రసాయనిక ఎరువుల వాడకం కూడా తగ్గిపోతుంది. ప్రధాన పంటల్లో చీడపీడలు, తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం నేలకు పెరుగుతుంది. దీంతో దిగుబడులు అమాంతం పెరిగే అవకాశం ఉంది. నవధాన్యాల సాగుతో ప్రకృతి వైపరీత్యాలు తట్టుకునే సామర్థ్యం నేలకు పెరుగుతుంది.

**పీఎండీఎస్ సాగుకు ఆసక్తి**

నంద్యాల జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో గత ఏడాది 70,260 మంది రైతులు 54,274.17 ఎకరాల్లో పీఎండీఎస్ పద్ధతిలో నవధాన్యాల మిశ్రమ పంటను సాగుచేశారు.

**కేవలం 40 రోజుల పంట**



నీటి సౌకర్యం ఉన్న పంట పొలాల్లో ఈ మిశ్రమ పంటను సాగుచేస్తున్నారు. 40 రోజుల్లోనే ఏపుగా పెరిగిన పంటను పశుగ్రా సం కింద వినియోగిస్తుండడంతో అన్ని పో షకాలతో కూడిన సమతుల్య ఆహారం పశువులకు లభిస్తోంది. దీంతో పశువులు బలిష్టంగా, ఆరోగ్యంగా ఉండడంతో పాటు గేదెలు, ఆవులు సమృద్ధిగా పాలను ఇస్తున్నాయి. –వేమారెడ్డి, రైతు, సోంపురం

**ఈ విధానం ఎంతో ఉపయోగం**



మిశ్రమ విత్తనాలను పంట విరామ సమయాల్లో భూమిపై చల్లితే నేల సారవంతం అవుతుంది. రైతులకు అదనంగా ఆదాయం లభిస్తుంది. ఈ విధానాన్ని అవలంభిస్తున్నందు వల్లే మా పంట పొలాల్లో రెండేళ్లుగా అధిక దిగుబడిని సాధిస్తున్నా. –మధురెడ్డి, రైతు, కొచ్చెర్వు గ్రామం

**సమన్వయంతో సాగును పెంచుతాం**



వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ అధికారులతో పశుసంవర్ధకశాఖ అధికారులు సమన్వయం చేసుకుని పంట పొలాల్లో భూసారం అధికం చేసేందుకు రైతులకు పీడీఎంఎస్ విధానంపై అవగాహన కల్పిస్తున్నాం. పశుగ్రాసం కొరత తీర్చే ఈ విధానంపై జిల్లాలో రైతులకు క్రమేపీ ఆసక్తి కలుగుతుండడం శుభపరిణామం. –డాక్టర్ నాగరాజు, పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు, డోన్

### మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు



ముచ్చట్ల మల్లికార్జునస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్. కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఆలయంలో జ్యేష్ఠ మాసం సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వామికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు

### 'ప్రకృతి' ఉత్పత్తులను ప్రోత్సహిద్దాం



తహసీల్దార్ కార్యాలయం వద్ద విక్రయానికి ఉంచిన కూరగాయలు

డోన్ టౌన్: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు కొనుగోలు చేసి రైతులను ప్రోత్సహిద్దామని తహసీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ సునీల్‌రాజా అన్నారు. మండలంలోని చిన్న మల్కాపురం గ్రామ రైతు రాజేశ్వరరెడ్డి ప్రకృతి వ్యవసాయం విధానంలో పండించిన పంటలను సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో విక్రయానికి ఉంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సేంద్రియ ఎరువులు, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేసే కూరగాయలు ఆరోగ్యానికి మంచిదని పేర్కొన్నారు.

## ఘనంగా ఉమామహేశ్వరుని పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, పల్లకీ సేవను నిర్వహించారు. ఉదయం ఏకశిలా రూపంలో కొలువైన ఉమామహేశ్వరస్వామికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను అందంగా ముస్తాబు చేసి సంప్రదాయ బద్ధంగా పల్లకీ సేవను నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ ఈఓ చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

## బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



ప్రచారం నిర్వహిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

బనగానపల్లె రూరల్: బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించాలని కస్బా ఎంపీపీ పాఠశాల హెచ్ఎం సుంకన్న అన్నారు. సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు సత్యప్రకాష్, అబ్దుల్ కలీంతో కలిసి పాఠశాల సమీపంలోని కాలనీల్లో కరపత్రాలతో ఇంటింటా ప్రచారం చేశారు. హెచ్ఎం మాట్లాడుతూ.. కస్బా ఎంపీపీ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంను, తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నట్లు తెలిపారు. ఉచిత పాఠ్యాపుస్తకాలు, నోటుపుస్తకాలు, బ్యాగ్‌లు ఇవ్వడంతో పాటు మధ్యాహ్న భోజనం వసతి కూడా ఉన్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు.

## సచివాలయ ఉద్యోగుల ఇష్టారాజ్యం



ఉదయం 10.50 గంటలకు సచివాలయం వద్ద వేచి చూస్తున్న గ్రామస్తులు, సాయంత్రం 4.30కే ఖాళీ

సంజామల: మండల పరిధిలోని ఆల్వకొండ గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 10.50 తర్వాత రావడం.. సాయంత్రం 4.30 గంటలకే ఇళ్లకు వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. వివిధ పనులపై సచివాలయానికి వచ్చే ప్రజలు సిబ్బంది లేక గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కొందరికి తల్లికి వందనం నగదు జమకాలేదు. దీనిపై విచారించేందుకు సచివాలయానికి వస్తే సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## ఆర్థిక సంఘం నిధులు జమ చేయాలి



ఎంపీడీఓకు వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్‌లు

కొలిమిగుండ్ల: గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను తక్షణమే జమ చేయాలని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో కలిసి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రసాదరెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024 నవంబర్‌లో పంచాయతీలకు నిధులు కేటాయించినా రాష్ట్ర ప్రభుత్వం జమ చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. నిధుల సమస్యతో పంచాయతీల్లో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. తాగునీరు, పారిశుద్ధ్య లోపం, వీధిలైట్ల నిర్వహణ తదితర పనులు చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిధులను కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకానికి వాడుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పంచాయతీలను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు జమ చేసేలా చొరవ చూపాలన్నారు. రూ.3వేలు గౌరవ వేతనం తీసుకునే సర్పంచ్‌లకు తల్లికి వందనం పథకం అమలు చేయకుండా చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను పంచాయతీలకు జమ చేయాలని డిమాండ్ చేశారు.

## ఈకేవైసీ నమోదుకు పాట్లు



ఈకేవైసీ చేయించుకునేందుకు గుమిగూడిన రైతులు

కొలిమిగుండ్ల: అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం పొందేందుకు ఈకేవైసీ కోసం రైతులు రైతు సేవా కేంద్రాలకు క్యూకడుతున్నారు. త్వరలోనే ఈపథకం అమలు అవుతుందని ప్రచారంలో ఉండడంతో రైతులు ఆధార్ కార్డులు తీసుకువెళ్లి ఈకేవైసీ చేయించుకుంటున్నారు. మండలంలో 4వేల మందికి పైగానే ఈ పథకానికి అర్హులున్నారని తేలింది. మూడు రోజుల్లో ఈకేవైసీ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. సమయం తక్కువగా ఉండడంతో రైతులు పనులు మానుకుని రైతు సేవా కేంద్రాలకు వెళుతున్నారు. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద రైతుల ఖాతాల్లో జమ చేయగా కూటమి ప్రభుత్వం ఒక్క రూపాయి జమ చేయలేదు. ఈఏడాది అయినా జమ చేస్తారనే ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు.

# రాష్ట్రంలో ఆటవిక పాలన

- మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు
- వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి వెన్నుపోటు పుస్తకావిష్కరణ



వెన్నుపోటు పుస్తకావిష్కరణ చేస్తున్న శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్:ప్రజలను మాయమాటలతో మభ్యపెట్టి రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకున్న కూటమి ప్రభుత్వం అశాంతి, అరాచకం, ఆటవిక పాలన కొనసాగిస్తోందని రాష్ట్ర మీట కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుప్రసాద్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుమలేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్ ఆరోపించారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి స్వగృహంలో సోమవా రం జగన్ అంటే నమ్మకం .. చంద్రబాబు అంటే మోసం అనే వెన్నుపోటు పుస్తకాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో శాంతి భద్రతలు పటిష్టంగా ఉండేవని, సంక్షేమ పథకాలతో ప్రజలు సుభిక్షంగా ఉండేవారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం విధ్వంసం దిశగా పయనిస్తోందన్నారు. ఎన్నో విప్లవాత్మకమైన పథకాలతో అవినీతికి తావులేకుండా పారదర్శక పాలనను గత ప్రభుత్వం అందిస్తే, అవినీతి, రాజ్యాంగ ఉల్లంఘన, మహిళలపై అఘాయిత్యాలు, బాలికల మానభంగాలు, అబద్ధాలు, వివక్ష, దుర్మార్గ పరిపాలన కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు. గత ప్రభుత్వం మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌లా పవిత్రంగా భావించి మొదటి ఏడాదిలోనే 99 శాతం పథకాలు అమలుచేస్తే నేటి కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను కూడా సక్రమంగా అమలు చేయలేక రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతుందని విమర్శించారు.

**ఉన్మాద రాజకీయం**

అధికారం చేపట్టిన నాటి నుంచి కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్మాద రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమం కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. రానున్న రోజుల్లో కూటమి నేతలకు ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారన్నారు. విద్య, వైద్య రంగాన్ని గత ప్రభుత్వం పటిష్టం చేస్తే నేటి కూటమి ప్రభుత్వం అంగడి సరుకుల్లా బహిరంగ మార్కెట్లో విద్య, వైద్య రంగాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించిందన్నారు. అక్రమ మద్యం, బెల్టుషాపులు, మైనింగ్, అక్రమణలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అనంతరం కూటమి ప్రభుత్వం హామీలను విస్మరించి ప్రజలను వెన్నుపోటు పొడిచిన విధానంపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సోమేష్‌యాదవ్, డోన్, బేతంచెర్ల పట్టణ అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, పిట్టల జాకీర్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, మార్కెట్‌యార్డు మాజీ వైస్‌చైర్మన్ ఓబులాపురం మదన్, నాయకులు అబ్దుల్లా, వంశీ, నాగేశ్వరరావ్, వెంకటేష్, ఎద్దులన్న, రవి, చంద్ర, సురేష్, అశోక్, ఆర్ట్ రమణ, తిరుమలేష్, రామానాయుడు, సురేంద్ర నాయుడు, రాజా మహేష్, రఫి, మౌలాలి, వడ్డె రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

### భార్య, భర్తపై చీటింగ్ కేసు

కోవెలకుంట్ల: కుమార్తె, అల్లుడు నమ్మించి ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకుని మోసం చేయడంతో బాధితురాలు సోమవారం పోలీసులను ఆశ్రయించింది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సమాచారం మేరకు.. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నివాసం ఉంటున్న ఈశ్వరమ్మ కుమార్తె అన్నపూర్ణకు రాఘవరెడ్డితో వివాహం చేసింది. ఇటీవల కుమార్తె, అల్లుడు ఈశ్వరమ్మ పేరున ఉన్న ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. తల్లి బతికి ఉన్నంతకాలం ఇంటికి సంబంధించి సర్వ హక్కులు తనకే చెందుతాయని అగ్రిమెంట్ రాసి ఇచ్చారు. తీరా ఆమె బంధువుల ఇంటికి వెళ్లగా ఆ ఇంటిని మరొకరికి బాడుగకు ఇవ్వడంతో బాధిత మహిళ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు భార్య, భర్తలపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

### బాధ్యతల స్వీకరణ



జ్యోతి

సంజామల: మండల వ్యవసాయాధికారిగా భూమా జ్యోతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఏఓ కోవెలకుంట్ల మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొలిమిగుండ్ల మండలంలో పని చేస్తున్న జ్యోతి సంజామలకు వచ్చారు. ఆమెకు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్ స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

### తండ్రీకుమారుడికి గాయాలు

డోన్ టౌన్: మండలంలోని ఓబులాపురం గ్రామ సమీపంలో ఉన్న జాతీయ రహదారిపై బైక్‌ను కారు ఢీకొనడంతో తండ్రీకుమారుడు గాయపడ్డాడు. వివరాలు.. డోన్ మండలం పెద్ద మల్కాపురం గ్రామానికి చెందిన దస్తగిరి తాడూరు గ్రామంలో వివాహం చేసుకుని భార్య ఊరిలోనే నివాసం ఉంటున్నాడు. ఈ నెల 15న కుమారుడు సాహెర్ హుస్సేన్(3)తో కలిసి బైక్‌పై స్వగ్రామమైన పెద్దమల్కాపురానికి వెళ్లి సోమవారం రాత్రి తాడూరుకు తిరుగు ప్రయాణం అయ్యాడు. ఓబులాపురం గ్రామ సమీపంలో రోడ్డు దాటుతుండగా అనంతపురం నుంచి కర్నూలు వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రీకుమారుడికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమ్మిత్తం డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నెలాఖరు వరకే గడువు

డోన్ టౌన్: విద్యుత్ గృహ వినియోగదారులు అదనపు లోడు క్రమబద్ధీకరణ కోసం 50 శాతం రాయితీతో చెల్లించడానికి ఈ నెల 30వ తేదీ చివరి రోజు అని విద్యుత్‌శాఖ డోన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కమలాకర్‌రావు తెలిపారు. కిలో వాట్‌కు డెవలప్‌మెంట్ చార్జీలు గతంలో రూ.2వేలు ఉండగా ఇప్పుడు 50శాతం రాయితీ కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశం జూన్ 30వ తేదీ వరకు మాత్రమేనని చెప్పారు. గృహ విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు స్థానిక కార్యాలయం లేదా ఏఈలు, లైన్‌మన్‌లను సంప్రదించాలన్నారు.

### బేతంచెర్ల ఏఓగా బాధ్యతలు

బేతంచెర్ల: మండల ఏఓగా విజయకుమార్ రెడ్డి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన కిరణ్ కుమార్ ఎమ్మిగనూర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురం జిల్లాలో పనిచేస్తున్న విజయ భాస్కర్‌రెడ్డి బదిలీపై బేతంచెర్లకు వచ్చారు. ఆయనకు అగ్రికల్చర్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

### అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం

బేతంచెర్ల: ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్‌పై ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ సభ్యులు అసత్య ఆరోపణలు చేస్తే ఉరుకోమని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యప్రతాప్ అన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీవాణి పాఠశాల వద్ద అక్రమంగా అమ్ముతున్న బుక్స్‌ను బయట ప్రదర్శించి నిరసన తెలిపారు. పోలీసులు జోక్యం చేసుకోవడంతో యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐ, వెంకటేశ్వరరావు, ఎంఈఓ సోమశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు.

### డిజిటల్ పేమెంట్స్‌కు వినతి

బనగానపల్లె రూరల్: పట్టణంలో జైళ్లశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌లో డిజిటల్ పేమెంట్స్‌కు అనుమతి ఇవ్వాలని కోరుతూ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కేడం సుబ్బరాయుడు, ఆ సంఘం సభ్యులతో కలిసి సోమవారం తహసీల్దార్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. నగదు అందుబాటులో లేకపోవడం వల్ల వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డిజిటల్ పేమెంట్స్ సులభతరంగా ఉంటుందని, ప్రోత్సహించాలని కోరారు.

## ఉపాధ్యాయుడు లేని పాఠశాల..!



మీర్జాపురం మెయిన్ ప్రాథమిక పాఠశాల

కొలిమిగుండ్ల: మూరుమూల గ్రామాల్లో విద్యాభివృద్ధి కోసం లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేని కారణంగా వృథాగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. మీర్జాపురంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలలో గత విద్యా సంవత్సరం మధ్యలో అక్కడ విధులు నిర్వహించే ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లిపోయాడు. అప్పటి నుంచి పోస్టు ఖాళీగా ఉంది. 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభం రోజు సైతం ఉపాధ్యాయుడు లేక పాఠశాల ఖాళీగా ఉంది. ఇక్కడ 20 మందికి పైగానే విద్యార్థులున్నారు. ఇటీవల ప్రభుత్వం నుంచి పాఠ్యపుస్తకాలు, యూనిఫాం మంజూరు చేశారు. ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థులను సమీపంలోని డిపెప్ స్కూల్‌కు పంపుతున్నారు. డిపెప్ స్కూల్‌లో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా ఒకరు పదోన్నతిపై వెళ్లారు. ఉన్న ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరి బదిలీలో భాగంగా ఇతర పాఠశాల కోరుకున్నారు. సింగిల్ టీచర్ కావడంతో ఎవరైనా వచ్చే వరకు ఆటీచర్ ఉండాల్సి రావడంతో విధులు నిర్వహిస్తున్నారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు-నేడు పథకం కింద మెయిన్ ప్రాథమిక పాఠశాల ఎంపిక కావడంతో పలు పనులు చేపట్టారు. విద్యార్థులకు టేబుళ్లు ఏర్పాటు చేశారు. అన్ని వసతులు సమకూరాక ఉపాధ్యాయుడు లేకుండా పోయాడు. తమ పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించి పాఠశాల జరిగేలా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని తల్లితండ్రులు కోరుతున్నారు.